కథ

# మిలటరీవాడు



మలయాళం: తగళి శివశంకరపిళ్లై
తెలుగు : ఎల్. ఆర్. స్వామి

"పోలీసు స్టేషన్"లో జనం గుమిగూడి వుండటం చూసి అక్కడికి వెళ్ళాడు వాడు. అక్కడ చేరిన ప్రతి ఒకరి ఎత్తు బరువు చూసారు. ఇంటిపేరు అడిగారు. ఆ ప్రశ్నకి వాడి దగ్గర జవాబు లేకపోయింది. అయినా, ఆ రోజు తీసుకున్న నలుబదిమందిలో ఒకడయ్యాడు, వాడు.

ఆరోజే వాళ్ళని తీసుకొని వెళ్ళారు. చాలా ఆనందంగా వుండేది యాత్ర. మూడు పూట్లా మంచి తిండి పెట్టారు. సొంత ఖర్చుకని కొంత డబ్బు కూడా ఇచ్చారు. కలసి ప్రయాణం చేసే వారు కూడా మంచివారే ! త్వరలోనే స్నేహితులుగా మారిపోయారు, అందరూ.

శిక్షణాకాలం కష్టంగానే వుండేది. అయినా మూడు పూట్లా భోజనముందనే ఆనందం, ఆ కష్టాన్ని మరిపించేసింది. జీవితం మెల్లమెల్లగా విస్తృతమైంది. కొత్త అనుభవాలు చవిచూడటం అతనికి ఆనందాన్ని ఇచ్చింది. తాను కూడా ఒక మనిషి అయ్యాడనే ఆలోచన సంతృప్తిని కూడా ఇచ్చింది. ముష్టివాడనే భావన మెలమెల్లగా తొలిగిపోయింది. పక్కలేనిదే, ఇప్పుడు నిద్ర పట్టదు అతనికి. తలగడ కూడా కావాలి. అంతేకాదు, నాలికకు రుచులు తెలుస్తున్నాయి. ఏదో చెయ్యవలసినది ఉందని తోచింది అతనికి. ఆ ఆలోచనతోనే ముందుకు సాగుతున్నాడు. ఇప్పుడు, అతనికి కొన్ని బాధ్యతలు వున్నాయి; హక్కులు కూడా.

ఆ సైన్యాన్ని రెండువేల మైళ్ళ దూరానికి మార్చారు. ఆ తరువాత మరోచోటుకి; ఇంకో చోటుకి, ఇలా నాలుగైదుసార్లు బదిలీ చేసారు. ఇప్పుడు, అతడు హింది మాటలాడగలడు. ప్రధాన నగరాలన్నీ చూసాడు. ఎలా బ్రతకాలో తెలుసుకున్నాడు. చేతిలో డబ్బుంది. ప్రభుత్వం నుంచి రావలసిన డబ్బులు కూడా ఉన్నాయి.

ఒకరోజు పై అధికారి పిలిచి కావలసిన వారు నెలరోజులు సెలవు పెట్టుకోవచ్చని ఊళ్ళు వెళ్ళి రావచ్చని చెప్పారు. ఆ మాటలు విని సైనికుల ముఖాలు ఆనందంతో వెలిగాయి. అతడు కూడా ఆ ఆనందంలో పాలు పంచుకోలేకపోలేదు. కాని నిజంగా ఆనందించలేకపోయాడు. అయినా అతడు కూడా ఒక 'ఫాము' నింపాడు.

ఆరోజు రాత్రి భోజనానంతరం సైనికులు గుంపులు గుంపులుగా చేరి ఊరు వెళ్ళటం గురించి మాట్లాడుకున్నారు.

"మనం కలిసి వెళ్దామా ?" ఒక కర్ణాటక వాడు ఒక తమిళయన్ని అడిగాడు.

"కలిసి వెళ్ళవచ్చు కాని...."

""ఏమి...?"

"నేను రేపు సాయంత్రమే బయలుదేరాలని అనుకుంటున్నాను"

"నేనూ అలాగే అనుకుంటున్నానుగా, ఎన్నేళ్ళైందో మా పాపను చూసి...." అతడు మాట పూర్తి చెయ్యలేకపోయాడు గొంతు జీరబోయింది. పాప అతని మనస్సులో కదిలింది.

"పాపం ! మా అమ్మ" తమిళుడు అన్నాడు.

"ముసలిది. చెప్పకుండా వచ్చేసాను" కళ్ళు వొత్తుకుంటూ అన్నాడు, అతడు. "కళ్ళల్లో వత్తులు వేసుకొని ఎదురుచూసి చూసి విసిగిపోయి వుంటుంది."

"మీరెప్పుడు బయలుదేరుతున్నారు రామన్ నాయర్?" అడిగాడు ఒకడు.

"మనం కలిసి వెళ్ళవచ్చు కదా?"

"అలాగే... అలాగే....." చాలా యాంత్రికంగా జవాబు ఇచ్చాడు రామన్ నాయర్.

"ముప్పది రోజులకన్నా ఉండటం కుదరదా?" ఒకడు మరొకరికి అడిగాడు.

"ఒంట్లో బాగోలేదని టెలిగ్రాం కొడితే సరి."

"నా ఆలోచన కూడా అదే. ఇంటివద్ద బోలెడు పనులున్నాయి."

"అలాంటివేమి కుదరదు. ఇప్పుడు సెలవు ఎందుకు ఇస్తున్నారో తెలుసా? ఊరు వెళ్ళి తల్లిదండ్రులని, పెళ్ళాం పిల్లలని చూసి రావటానికి అదృష్టం బాగుంటేనే మళ్ళీ వాళ్ళని చూడగలం. తిరిగి రాగానే యుద్ధానికి పంపుతారట !"

ఎవరికి పెదవి పెగలలేదు. హఠాత్తుగా విషాదాత్మకంగా మారింది వాతావరణం.

"నేను పోయినా పర్వాలేదు. పాపకి వెయ్యి రూపాయల కన్నా ఎక్కువే వస్తుంది." గట్టిగా నిట్టూరుస్తూ అన్నాడు కర్ణాటకవాడు.

"వెయ్యి రూపాయలు వస్తాయి కనుక మా అమ్మని ఎవరైనా చూస్తారులే." తమిళుడు అన్నాడు.

ఆ రాత్రి ఎవ్వరికి నిద్ర పట్టలేదు. నిట్టూర్పులతో గడిచింది ఆ రాత్రి. ముప్పదిరోజులలో చెయ్యవలసిన పనులు ఎన్నెన్నో !

సెలవు రోజులలో చెయ్యవలసిన పనుల గురించి రామన్‌నాయర్ కూడా ఆలోచించాడు. కాని చెయ్యవలసిన పనులేమి లేకపోవటం వల్ల ప్రణాళికలు తయ్యారుచేసుకోలేకపోయాడు. "ఇంటిలో నీకు ఎవరెవ్వరున్నారు?" రామన్ నాయర్. పక్కమంచం మీద పడుకున్న అతడు అడిగాడు.

"ఎవరూ లేరు"

"మరి సెలవులకు ఎక్కడకి వెళ్తావు?"

రామన్ నాయర్ మాట్లాడలేదు. ఆ ప్రశ్నకి అతనివద్ద జవాబు లేదు.

"మీ ఊరు త్రివేండ్రం కదూ?"

> ## జయకేతనం
>
> నిరంతరం వెలిగే
> సూర్యుణ్ణి చూసి
> చీకటి ఎలా పారిపోతుందో.....
> నిర్విరామంగా శ్రమించే
> వ్యక్తిని చూసి
> ఓటమి భయపడుతుంది !
> భూగోళం
> ఆశ్చర్యపడుతుంది !
> ఆత్మ విశ్వాసమే
> ఆలంబనగా సాగే మనిషిని చూసి
> ఆకాశం ఆనందిస్తుంది !
> ఆశయాన్ని సాధించిన వాడిని చూసి
> జయకేతనం....
> రెపరెపలాడుతుంది !
>
> – దాస్యం సేనాధిపతి

ఏం చెప్పాలో తోచలేదు అతనికి. ఒక నిమిషం ఆగి అన్నాడు. "నన్ను తీసుకున్నది త్రివేండ్రం నుంచే..."

"మరి నీ ఊరు...."

"ఏదైతేనేమిటి?" రామన్ నాయర్‌కి కోపం వచ్చింది.

"నేను ఊరు వెళ్ళటం లేదు. నాకు సెలవులొద్దు." గట్టిగా అరిచాడు రామన్ నాయర్.

"నీకు కోపం వస్తే నా మీద అరుస్తావెందుకు? నీవు ఇంటిలో గొడవపడి వచ్చావేమో...... అందుకు నా మీద ఎగురుతావెందుకు?"

మాటలు ఆగిపోయాయి. గంటలు గడిచాయి. కాని కంటిమీద కునుకు పట్టలేదు అతనికి.

రామన్ నాయర్ – తనకి ఆ పేరు పెట్టిన దెవరో తెలియదు, అతనికి. చిన్నప్పుడు తిండి వెతుకుతూ వీధి వీధి తిరిగినప్పుడు 'రామన్' అని పిలవబడిన గుర్తు లేదు. ఎప్పటి నుంచి ఎక్కడ నుంచి ప్రారంభమైంది, ఈ పేరు?

"నాకు సెలవు ఒద్దు" అనే అతని మాటలు అతని చెవులలో గింగిరుమన్నాయి. అలా అరవకుండ వుంటే బాగుండేదని అనిపించింది, అతనికి. నిర్భాగ్యురాలైన ఆ స్త్రీ – ఆమె తన తల్లి – ఎక్కడో ఒకచోట వుండే వుంటుంది కదా ! పోని తల్లి లేకపోతే తండ్రి – తండ్రి కూడా లేకపోయినా, తనకన్నా ముందో వెనుకో పుట్టిన ఎవరో ఒకరు, ఎక్కడో వుండవచ్చు కదా ? తనని గుర్తించేవారు – తన మనిషి అనేవాడు – ఒకరైనా ప్రపంచంలోనే వుండరా ?

ఏమో ఉండవచ్చును. వెతుకుతే కనబడవచ్చు కదా !

అందరికన్నా ముందే లేచాడు, రామన్ నాయర్ అందరికన్నా ముందే తయారైనాడు.

✿ ✿ ✿

నాలుగైదు రోజులుగా, ఆ నగరంలోని ప్రతి కూడలిలోను, ప్రతి సందులోను ఒక మిలటరివాడు కనబడుతున్నాడు. రాత్రి కూడా, అతడు నడుస్తూనే వున్నాడు. ఏ ఊరు వచ్చాడని కాని ఎక్కడ వుంటున్నాడని కాని ఎవరికీ తెలియలేదు.

ఒకరోజు అతడు నగరంలో కనబడలేదు. మరునాడు, నగరం నుంచి యాబది కిలోమీటర్ల దూరంలో వున్న ఒక పట్నంలో కనబడ్డాడు. ఒక ఇంటిగుమ్మం వైపు తదేకంగా చూస్తూ నిలబడ్డాడు. బరువైన ఇనుపపెట్టె అతని చేతిలో వుంది. రోడ్డు మీద వెళ్ళిన ఒకడు రామన్ నాయర్‌కి చెప్పాడు, ఆ ఇంటిలో ఎవరూ లేరని.

దేవుని దర్శనం చేసుకొని గుడి బయటకు

వచ్చిన ఒక పెద్దాయన వెనుక నడిచాడు అతడు. కొంత దూరం అతని వెనుక నడిచాక అన్నాడు, నేను 'రామన్ నండి....'

"రామనా... ఏ రామన్?" పెద్దాయన వెనుకకు తిరిగి చూసాడు.

"రామన్ నాయర్ జవాబు చెప్పలేక పోయాడు. ఏం చెప్పగలడు? కాసేపు అలాగే నిలబడి, ఆ తరువాత భారంగా అడుగులు వేసుకుంటూ, రోడ్డు మలుపు తిరిగి వెళ్ళిపోయాడు.

మరునాడు ప్రొద్దున బజారులోని హోటల్ తలుపుమీద "రామన్" అని కొత్తగా చెక్కినట్లు కనబడింది. "ఆ పేరు చెక్కినది 'నేనే...'" హోటల్ తలుపులు తెరవటం కోసం వచ్చిన యజమానితో అన్నాడు, రామన్ నాయర్. హోటల్ యజమాని, ఆ మాటలు పట్టించుకోలేదు. మరో అతన్ని వెతుకుతూ త్రివేండ్రం నగరమంతా తిరిగాడు రామన్ నాయర్.

పదిరోజులు గడిచాయి. ఎవరూ అతన్ని పలకరించలేదు. పరిచయ చిహ్నంగా చిరునవ్వు నవ్వలేదు. "ఎప్పుడు వచ్చావు?" అని అడగలేదు. ఒక ఊరునుంచి మరో ఊరుకి వెళ్ళాడు, అతడు. రాష్ట్రమంతా తిరిగాడు, ఒక పలకరింపు గురించి, చిరునవ్వు గురించి కాని ఫలితం శూన్యం.

రోజులు రాలిపోయాయి. కనబడిన ప్రతి చిన్నవాడిని తమ్ముడు అని పలకరించాడు, అతడు కొందరిని అన్నయ్యా అని, మరికొందరిని మామయ్యా అని పలకరించాడు. కాని ఎవరూ ప్రతిస్పందించలేదు పక్షివేగంతో ఊళ్ళన్నీ మళ్ళీ మళ్ళీ తిరిగాడు. సెలవులైపోతున్నాయి. అయినా ఒక చిరునవ్వు కాని, ఆప్యాయతతో కూడిన పలకరింపు కాని అందుకోలేక పోయాడు. ఎక్కడ భోజనం చేసినా డబ్బులు ఇవ్వవలసినదే !

✿ ✿ ✿

నగరం నుంచి దూరంగా వున్న ఒక పల్లె – ఆ పల్లెలో దూరంగా విసిరేసినటువంటి ఒక చిన్న పెంకుటింట్లో కూర్చొని భోజనం చేస్తున్నాడు అతడు. ఒక ముసలి తల్లి వడ్డిస్తోంది. వడ్డిస్తూనే ఏవేవో కబురులు కూడా చెప్తోంది. అతన్ని 'బాబూ' అని పిలిస్తోంది.

"ఆరుగురు బ్రతకాలి కదా, బాబూ...." ఆమె తన ఇంటిసంగతులు అతనికి వివరించింది. "ఈ పొలం ఒకటే ఆధారం. నిరుడు పెండలం బాగా పండింది కనుక.... కొంచం కూర వేసుకోబాబూ...."

"ఇప్పటికే చాలా ఎక్కువ తినేసానండి."

"ఎక్కువా? ఎం తినలేదే... ఇదేం తిండి..." ఆమె అంది.

"కొంచెం అన్నం పెట్టుకుని పెరుగు పోసుకో..."

"ఒద్దమ్మా. ఈ రోజు ఎక్కువ తినేసాను."

"దిష్టి పెట్టుకోకు నాయినా." ఆమె ఆప్యాయంగా అంది. "పెరుగు వేస్తాను."

ఒక నిమిషం వాళ్ళమధ్య మౌనం ఆవరించింది. "అయితే మొగపిల్లలు లేరన్నమాట." ఒక నిమిషం తరువాత అతడు అన్నాడు.

"దేవుడు ఒక నలుసుని ఇచ్చినట్టే ఇచ్చి...." ఆమె గొంతు జీరబోయింది.

ఒద్దన్నా, మరికొంచం అన్నం వడ్డించింది. అలా భోజనంచెయ్యటం అతనికి జీవితంలో మొదటిసారి, అది. అతడు తిన్నది చాలదని మరి కొంత తినాలని ఆమె తప్ప, వేరెవ్వరు ఆశించలేదు.

ఆ రాత్రి ఇంటి వరండాలో ఆందోళనగా అటూ, ఇటూ తిరిగాడు. మళ్ళీ మళ్ళీ అన్నం వడ్డించి తినమని బలవంతం చేసిన ఆ ముసలి తల్లి తనకి ఏమవుతుందని ఆలోచించాడు. తనపట్ల ఆమెకి ఎందుకింత ఆప్యాయత? తనపట్ల ఆప్యాయత చూపేవారు ఎవరున్నారు? తను పోతే రెండు కన్నీటి బొట్లు రాల్చె వారెవ్వరున్నారు?

తెల్లవారింది.

"నేనొక మాట చెప్పనా?" అతడు, ఆమెని అడిగాడు.

"చెప్పు"

"నేను నాయర్ కుర్రవాడిని, అమ్మా."

"ఆ మాట నిన్ననే చెప్పావుగా..."

"నాకు ఊరు లేదు. తల్లి దండ్రులు లేరు. చుట్టాలు లేరు..."

"ఆ మాట కూడా నిన్ననే చెప్పావుగా...."

"నాకు ఎవరూ లేరమ్మా." అతడు వెక్కి వెక్కి ఏడ్చాడు.

✿ ✿ ✿

మరునాడు ఆ ఇంటిలో ఒక పెళ్ళి జరిగింది. ముప్పయ్యేళ్ళు దాటిన లక్ష్మికి ఒక పెళ్ళికొడుకు దొరికాడు !

సాయంత్రం చాలా అందంగా వుండేది. నీరెండలో వరిచేను తళతళ మెరుస్తూ వుండేది. రోడ్డు చూస్తూ నిలబడ్డాడు, రామన్ నాయర్.

"ఇక్కడ నిలబడ్డారేంటి?" ఎద్దులని ఇంటికి తోలుకొని వెళ్ళే ఒకరైతు రామన్‌నాయర్‌ని పలకరించాడు.

"ఊరికనే..." ఆనందంగా జవాబు ఇచ్చాడు, అతడు.

రామన్ నాయర్‌కి, ఇప్పుడు బంధువు లున్నారు ! పలకరించేవాళ్ళు వున్నారు ! అతని ఆనందానికి కారణం అది.

"ఈరోజే బయలుదేరాలా !" లక్ష్మి మాటలు విని తల తిప్పి చూసాడు.

"బయలుదేరాలి. దేవుని దయ వుంటే మళ్ళీ కలుద్దాం"

ఆమె నిట్టూర్చింది.

"ఈ రోజు వుండి రేపు వెళితే...."

కుదరదు అన్నట్లు తల తిప్పాడు.

రాత్రి తొమ్మిదిగంటలు దాటింది. ఆకాశాన పూర్ణచంద్రుడు వెలుగుతున్నాడు వెన్నెలలో తనట్రంకు పెట్టె మోస్తూ పొలం గట్టుమీదుగా నడచివెళ్ళె అతన్ని చూస్తూ నిలబడింది లక్ష్మి.

ఆ ఇంటివారగా పారే వాగు తన జీవన గీతం పాడుతూనే వుంది. ఆ ఇంటికి మిలటరి వాడి కుటుంబ 'పెన్షన్' వస్తోంది ఇప్పుడు. నెలకి నలుబది రూపాయలు ! రెండు మూడు బిందెలు రెండు మంచాలు కొనుక్కుంది లక్ష్మి – కొన్ని గిన్నెలు కూడా – అన్నింటిలోనూ, తన పేరు, రామన్‌నాయర్ పేరు చెక్కించింది. ఇంటికి మరామత్తు చేయించి ప్రహరి గోడ కట్టించింది. ఇప్పుడు, ఊరులో ఆమెకు ఒక గుర్తింపు వుంది.

రోజు గుడికి వెళ్ళి దండం పెట్టుకొని ఏదో కోరుకుంటుంది, ఆమె. ఒక మనిషికి సరిపోయినంత భోజనం, ఆ ఇంటిలో ఎప్పుడూ వుంటుంది. రాత్రి ఏ చిన్న అలికిడి అయినా ఎవరు వచ్చారని అడుగుతుంది తల్లి. ఆ మాటకి ఉలిక్కిపడి లేస్తుంది లక్ష్మి. కాని ఆమె స్నేహితురాళ్ళు "నీ మగడు ఎప్పుడొస్తాడు" అని అడిగితే చెప్పలేకపోయేది, రహస్యంగా కన్నీరు కార్చేది.

ఒకరోజు పోస్టుమేన్ ఒక పెద్ద పాకెట్ తీసుకొని వచ్చాడు. ఆ పాకెటులో రామన్ నాయర్ ఫోటో ఉంది. ఆ రోజు నుంచి ఆ ఇంటి గోడని అలంకరించింది, ఆ ఫోటో.

మరో మూడు నెలలు గడిచిపోయాయి. నలుబది రూపాయలుబదులు వంద రూపాయలు రావటం ప్రారంభమైంది. మరో ఆరునెలలకు ఆ డబ్బు బాగా పెరిగింది.

పోలీసు స్టేషన్ నుంచి మూడు ట్రంకు పెట్టలు తీసుకోమని కబురు వచ్చింది, ఒకరోజు ఆ పెట్టలు తీసుకొని వచ్చి తెరిచి చూసింది, లక్ష్మి. పెట్టెలు నిండా మిలటరి ఆఫీసర్ బట్టలే ! పెట్టె లోపల వున్న ఒక చిన్న పెట్టెలో ఆమె పెళ్ళినాడు అతని మెడలో వేసిన పూలదండ కూడా వుంది.

ఖంగు తిన్నది ఆమె.

ఒక వారం తరువాత, పదివేల రూపాయల 'చెక్కు' వచ్చింది ఆమెకి. ఆ తరువాత నెల నెల వచ్చే 'మని ఆర్డర్' ఆగిపోయింది.

**(రెండో ప్రపంచ యుద్ధకాలంలో వ్రాయబడిన కథ ఇది.)**